www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 21 | ఫిబ్రవరి | 2025
పేజీలు 7

## ఎసిబికి చిక్కిన వ్యవసాయ అధికారి



**ప్రజాపక్షం/ఖమ్మం:** మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏవో సంతన్ కుమార్ ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ డిఎస్‌పి వై రమేష్ మీడియాకు వివరాలు వెల్లడిస్తూ గత వారం క్రితం ఒక రైతు ఏసీబీకి ఫోన్ చేసి పత్తి కొనుగోలుకు టిఆర్ ఇవ్వడానికి వ్యవసాయ అధికారి 30 వేలు లంచం అడుగుతున్నారని ఫిర్యాదు చేసారన్నారు. ఆ మేరకు వల పన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. ఫిర్యాదు దారుడు ఎవరని మీడియా అడిగితే పేరు వెల్లడించలేనన్నారు. ఎఓని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. ఎవరైనా లంచాలు అడిగితే టోల్ ఫ్రీ 1064కు ఫోన్ చేయొచ్చాన్నారు. ఈ రైడింగ్‌లో డిఎస్‌పితో పాటు ఇన్స్పెక్టర్‌లు శేఖర్, సట్ల రాజు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# పరికపిక్కలే..
# దొరకని తిమింగళాలు

-ఫిర్యాదు వస్తేనే ఏసిబి దాడులు -దిగువ తరగతి ఉద్యోగులే లక్ష్యమా



**ప్రజాపక్షం/ఖమ్మం :** లంచం లేనిదే ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరిగే పరిస్థితి లేదు. కొంత మంది అధికారులు ప్రజల పక్షాన ఆలోచించి పనిచేస్తున్నప్పటికీ వీరి శాతం చాలా తక్కువ. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల అవినీతి అధికారులకు చిక్కుతున్న వారంతా చిరుద్యోగులే. అంతే కాదు లంచం చేయాల్సిన పని ఈ విషయంలో అవగాహన కుదరని నేపథ్యంలోనే లంచం ఇచ్చే వారు అవినీతి నిరోధక శాఖాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు తప్ప అవగాహన కుదిరి పని జరిగితే విషయం బయటకు రాదు. మంగళవారం అడవి నుంచి మట్టి తోలుకునేందుకు లంచం అడిగారని ఏసిబి అధికారులకు ఫిర్యాదు చేసి అటవీ శాఖాధికారులను పట్టించాడు గుత్తేదారు. అదే గుత్తేదారు తాను గతంలో రెండుసార్లు లంచం ఇచ్చానని వాహనాలను విడిపించుకునే క్రమంలో లంచం ఇచ్చానాని చెప్పిన గుత్తేదారుకు అధికారులకు లంచం తీసుకోవడమే కాదు ఇవ్వడం నేరమన్న సంగతి తెలియదా. అధికారులకు లంచం అక్రమాలకు పాల్పడదామని భావించిన గుత్తేదారుని ప్రశ్నించాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఎప్పుడు ఎక్కడ దొరికినా ఫిర్యాదు చేస్తే తప్ప లంచాలు తీసుకుంటూ పట్టుబడిన అధికారి లేడు. విఆర్‌వోలు, రికార్డు అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు లేదా అదే క్యాడర్‌కు చెందిన వారే పట్టుబడుతున్నారు. ఓ పంచాయతీ కార్యదర్శి తప్పు చేస్తే దానిని అడ్డుపెట్టుకుని ఉద్యోగాన్ని ఎరగా వేసి లక్షలు గుంజే అవినీతి తిమింగళాల సంగతేంటి. ఖమ్మంజిల్లాలో ఆసుపత్రిలో నిధులు పక్కదారి పట్టాయన్న ఆరోపణలపై విచారణ జరిపిన అధికారి పెద్ద మొత్తంలో లంచం తీసుకుని మొత్తం విచారణను పక్కదారి పట్టించి లక్షలు గుంజిన వ్యక్తి నిజాయితీ పరుడు. వీరు ఎప్పుడు ఎవరికి చిక్కరు. వారు తీసుకునే లంచం ఎప్పుడు ఎక్కడ ఎలా అందజేయాలో చెప్పి చట్టానికి దొరకకుండా తప్పించుకు

మిగతా 2లో..

## వనం నుండి జనంలోకి
## శ్రీ రెక్కల రామక్క దేవత





-భక్తులతో కిక్కిరిసిన ఆలయం
-అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండల పరిధిలోని మర్కోడు పంచాయితీ పెద్దూరు గ్రామంలో కొమరం వంశీయుల ఆధ్వర్యంలో రెండేళ్లకు ఒక సారి అంగరంగ వైభవంగా నిర్వహించే శ్రీ రెక్కల రామక్క జాతరకు జిల్లా నలుమూలల నుండి భక్తులు

మిగతా 2లో..

## ఇతరులకు తోడ్పాటునందించాలి




-బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి
-విద్య ఆడపిల్లలకు అస్థిత్వం అందిస్తుంది
-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యార్థులు బాగా చదివి సమాజంలో గొప్ప స్థాయికి ఎదిగి ఇతరులకు తోడ్పాటునందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం శాంతి నగర్ ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు 47 మంది ప్రభుత్వ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాల కోసం అవసరమైన శిక్షణ, పుస్తకాలు అందించేందుకు మలబార్ గోల్డ్ చారిటబుల్ సంస్థ వారు నగదు ప్రోత్సాహకంగా రూ.3.80 లక్షల చెక్కును కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు చాలా కష్టపడి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తారని కొంత మంది ఆర్థికంగా స్థిరంగా ఉంటారని కొందరు పేదరికంలో ఉంటారని వారిని చూసి స్ఫూర్తి పొంది సమాజంలో అగ్రస్థాయికి చేరుకునేందుకు బాగా చదువుకోవాలన్నారు. మన చుట్టు పరిస్థితులు

మిగతా 2లో..

# దొరకని తిమింగళాలు

(మొదటిపేజీ తరువాయి)



తిరుగుతున్నారు. వివిధ శాఖల నుంచి వస్తున్న అనుమతులు, అందుకు ముట్టిన మొత్తం, అడ్డగోలు అనుమతులపై ఎప్పుడైనా అవినీతి నిరోధక శాఖాధికారులు విచారణ జరిపి బాధ్యులైన వారిని అరెస్టు చేశారా. అక్రమాన్ని సక్రమం చేసిన వారిపై ఏనాడైనా చర్యలు తీసుకున్నారా అవినీతి నిరోధక శాఖాధికారులకు పరిక పిక్కలు తప్ప తిమింగళాలు ఎప్పుడైనా దొరికాయా. అధికార యంత్రాంగం తీరుపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో క్షేత్రస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అధికారుల పనితీరుపై చర్చ మొదలైంది. గతంలో ఒకరో ఇద్దరో పైసలిస్తే తప్ప పని చేయని వారు ఉండేది. ఇప్పుడు పైసలు లేకుండా పనిచేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. లంచం తీసుకుంటే ఇబ్బంది అవుతుంది అన్న భావన అవినీతి అధికారులలో లేదు. కార్పోరేషన్‌లో పనిచేసే ఓ ఉద్యోగి తన వాస్తవ సంపాదనకు 500 రేట్లు అదనంగా సంపాదించి కండ్లు తిరిగే భవనాన్ని నిర్మించాడు. అది అడ్డుపెట్టుకుని అతని వద్ద లంచం తీసుకున్నారు కొంత మంది. ప్రభుత్వ కార్యాలయాలు పూర్తిగా అవినీతి కేంద్రాలుగా మారక ముందే అవినీతి నిరోధక శాఖను మరింత పటిష్టం చేయాల్సి ఉంది. లంచం తీసుకుంటే ఏమి కాదులే అన్న భావన నుంచి , అధికారులను లంచం ఇచ్చి ఏ పని అయిన చేయించుకోవచ్చులే అన్న భావనను తొలగించేందుకు చర్యలు ప్రారంభం కావాలి. అక్రమ సంపాదనపై చర్యలు మొదలు కావాలి. అవినీతి తిమింగళాలపై దృష్టి సారించాలి. అప్పుడే సామాన్యులకు కాస్త న్యాయం జరుగుతుంది. లేదంటే లంచం ఇచ్చే వాడే రాజై అక్రమాలన్ని సక్రమంగా మారి వ్యవస్థ మనుగ ప్రశ్నార్థకమవుతుంది.

## వనం నుండి జనంలోకి చేరిన
# శ్రీ రెక్కల రామక్క దేవత



(మొదటిపేజీ తరువాయి)



తండోప తండాలుగా తరలి వచ్చారు. గురువారం శ్రీ రెక్కల రామక్క అమ్మవారిని వనం నుండి గిరిజన సాంప్రదాయంలో ఆలయానికి చేర్చడంతో మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. ఈ మేరకు శ్రీ రెక్కల రామక్క అమ్మవారి జాతర ఏర్పాట్లను ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య గత రెండు రోజుల నుండి పెద్దూరు గ్రామంలోనే ఉండి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వహణ కమిటీతో ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. గురువారం పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావ్, ఇల్లందు డిఎస్‌పి ఎన్ చంద్రబాను అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేయగా ఆదివాసి గిరిజన సాంప్రదాయం ప్రకారం మేళతాళాల నడుమ ఆలయంలోనికి ఆహ్వానించారు. అమ్మవారి గద్దెల వద్ద వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు శ్రీ రెక్కల రామక్క జాతర జరగనుండడంతో ఆలయ ప్రాంగణంలోని వివిధ దుకాణాల సముదాయాలు ఏర్పడ్డాయి. కోరిన కోర్కెలు తీర్చే కొమరం వంశీయుల ఇలవేల్పు శ్రీ రెక్కల రామక్క జాతర నిర్వహణ కమిటిని ఆలయ కమిటీని పలువురు అభినందించారు. కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల స్థాయి వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. జాతరలో ఎలాంటి సంఘటనలు జరగకుండా టేకులపల్లి సిఐ సురేష్, స్థానిక ఎస్ఐ రతీష్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కొమరం హనుమంతరావు, కొమరం సత్యనారాయణ, మంగపేట మాజీ ఎంపీపీ కొమరం రామ్మూర్తి, ఆళ్లపల్లి మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కొమరం వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు కొమరం రాంబాబు, మాజీ సర్పంచ్ కొమరం శంకర్‌బాబు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నరసింహారావు, కొమరం సతీష్, కొమరం రామ్మూర్తి, మాజీ ఎంపిటిసి కొమరం హనుమంతరావు, కొమరం సర్వేష్, అక్షర సమిధ వ్యవస్థాపకులు కిషోష్ బాబు, వ్యాపారస్తులు గౌరిశెట్టి శ్రీనివాసరావు, నరేడ్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామ నరసయ్య, మాజీ ఎంపిటిసి పడిగ సమ్మయ్య, కో ప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుతారి కృష్ణ, వగలబోయిన సతీష్, పాయం సత్యనారాయణ, చందు, చంద్రం, పాల్గొన్నారు.

# ఇతరులకు తోడ్పాటునందించాలి





(మొదటిపేజీ తరువాయి)

మన చేతుల్లో ఉండవని అందుబాటులో ఉన్న విద్యను మనం వినియోగించుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని తెలిపారు. చదువు వల్ల సమాజంలో మనకు గౌరవం లభిస్తుందని ముఖ్యంగా ఆడపిల్లలకు విద్య అస్థిత్వం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకున్నాక మరో నలుగురికి సాయం చేసి వారి ఎదుగుదలకు తోడ్పాటు నందించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల విద్యకు ఇబ్బందులు కలుగకుండా సమాజంలో గొప్ప స్థాయికి ఎదిగి ఇతరులకు తోడ్పాటునందించాలని మంచి సంకల్పంతో మలబర్ గోల్డ్ సంస్థ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే 47 మంది విద్యార్థులకు రూ.3.80 లక్షలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా మలబార్ గోల్డ్ సంస్థ ప్రతినిధులకు కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇతరులకు సాయం చేయాలనే ఆలోచనతో మనమంతా ఇదేవిధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు పవన్, భరత్‌కుమార్, రాణి, శ్రీనివాస్, కిరణ్, మలబార్ సంస్థ జిల్లా హెడ్ విష్ణు, మేనేజర్ రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల ఇలవేల్పు మోతె గడ్డ వీరభద్రుడు









**-కాకతీయుల నాటి దేవాలయం**
**-గోదావరిలో కాలిపడక పడవ ప్రయాణం**
**-భక్తుల కోరిన కోర్కెలు తీర్చే వీరభద్రుడిగా ప్రసిద్ధి**
**-భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పవిత్ర గోదావరి నది మధ్యలో మోతెగడ్డ దీవిలో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రుస్వామి గిరిజనుల ఇలవేల్పుగా కొలుస్తుంటారు. గౌతమీ పదీ ద్వీపంలో వెలసిన వీరభద్రుని ఆలయానికి శివరాత్రి రోజున భక్తులు తెలంగాణ రాష్ట్రం నలుమూల నుంచే కాకుండా పక్కనే ఉన్న ఆంధ్ర, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వస్తారు. ఈ ద్వీపం చుట్టూ నీరు ఉన్నప్పటికీ గౌతమీనది ఎంత ఉధృతంగీ ప్రవహిస్తున్నప్పటికీ ఈ ద్వీపంలోని ఆలయంలోకి చుక్కనీరు కూడా రాకపోవడం విశేషం. ఈ ద్వీపం గోదావరి పెరుగుతుంటే దానికీ అనుగుణంగా ఎత్తు పెరుగుతుందని, ఇది వీరభద్రుని మహత్యమని భక్తుల విశ్వాసం. శివరాత్రి పర్వదినాన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కాకతీయుల నాటి ఆలయం కావడంతో దేవాలయం నిర్మాణంలో మార్పులు, చేర్పులు కొద్దిగా చేసినప్పటికీ భక్తుల సౌకర్యార్థం శాశ్వత ఏర్పాటులు చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతుంటారు.


### గోదావరిలో కాలినడకన, పడవ ప్రయాణం.....

మోతె గడ్డ వీరభద్రుని దర్శించుకునేందుకు భక్తులు గోదావరిలె పడవలలో, కాలి నడకన ప్రయాణం చేసి ఆలయానికి చేరుకుంటారు. ఈ ఆలయానికి వెళ్లాలంటే మోతె పుష్కర ఘాట్ నుంచి పడవలలో వెళ్లాలి, అలాగే భద్రాచలం నుంచి ఐదు కిలోమీటర్లు దూరంలో ఉన్న చెన్నంపేట, చింతలగూడెం గ్రామాలకు చేరుకుని అక్కడి నుంచి గోదావరి నది ఒడ్డున కాలినడకన ఆలయానికి చేరుకోవాలి.

### భక్తులు కోరిన కోర్కెలు తీర్చే వీరభద్రుడిగా ప్రసిద్ధి......

భక్తులు కోరిన కోర్కెలు తీర్చే వీరభద్రుడిగా ప్రసిద్ధి, గిరిజనుల ఇలవేల్పుగా కొలబడుతున్న శ్రీభద్ర కాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయానికి మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఇక్కడికి ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, సమీప రాష్ట్రాలైన ఆంధ్ర, చత్తీస్‌ఘడ్, ఒడిశా, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. శివరాత్రి పర్వదిన రోజు స్వామి వారిని భక్తులు దర్శించుకుని రాత్రి అంతా జాగారం చేసి అర్ధరాత్రి జరిగే స్వామి వారి కళ్యాణాన్ని తిలకించి మరుసటి రోజు తిరిగి భక్తులు ఇళ్లకు వెళ్లాతారు.

### భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు : ఆలయ కార్యనిర్వాణాధికారి జి సుదర్శన్



ఫిబ్రవరి 25 మంగళవారం మాఘ బహుళ త్రయోదశి నుండి 02 మార్చి 2025 ఆదివారం ఫాల్గుణ శుద్ధ తదియ వరకు జరిగే శ్రీ వీరభ్రద స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి మహోత్సవాల కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలను తీసుకుంటున్నట్లు ఆలయ కార్యనిర్వాణాధికారి జి సుదర్శన్ అన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం జరుగుతుందని, 26 బుధవారం రాత్రి 10గంటల 30నిముషాల నుండి తెల్లవారుజామున 4గంటల వరకు శ్రీ భద్రాకాళి సమేత శ్రీ వేరభద్రస్వామి కళ్యాణ మహోత్సవం కళ్యాణ మండలంలో అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులకు తాగ్రునీరు, మరుగుదొడ్డులు, స్నానాల వాటికలు ఏర్పాటు చేస్తున్నామని, రహదారి బాట మార్గంలో సైతం మంచి నీటి సదుపాయాలను, ఫైర్, గజా ఈత గాళ్లను అందుబాటులో ఉంచుతామని అన్నారు. విద్యుత్ సౌకర్యం కోసం దేవస్థానం అధికారులు ద్వార జనరెటర్స్ ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు.

# నిబంధనలు పాటిస్తూ పోలింగ్ సజావుగా నిర్వహించాలి

**-జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీ**
**- ఎంఎల్‌సి ఎన్నికల సిబ్బందికి శిక్షణ**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌ను నిబంధనలు పాటిస్తూ సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ తెలిపారు. ఈనెల 27న ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం సెక్టార్ అధికారులు, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, మైక్రో అబ్జర్వర్లు, ఓపివోలకు పోలింగ్ నిర్వహణపై శిక్షణనందించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డిఆర్‌వో పద్మశ్రీ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఎన్నికలు నిర్వహించుటకు సమాయత్తం కావాలని, ఎన్నికల విధుల పట్ల ఏమైనా సందేహాలు ఉంటే శిక్షణలో నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి ఒక్కరికి అనుభవం ఉందని గత అనుభవాలు ఉన్నప్పటికీ హ్యాండ్ బుక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ మరోసారి నూతనంగా చదవాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎన్. మాధవిలు పోలింగ్ నిర్వహణపై, బ్యాలెట్ బాక్స్‌లను ఓపెన్ చేయడం, క్లోజ్ చేయడం, సీల్ చేసే పద్ధతులపై అవగాహన కల్పించారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చి పోలింగ్ డ్యూటీ అలాట్‌మెంట్ ఆర్డర్‌తో పాటు సంబంధిత పోలింగ్ కేంద్ర సిబ్బందితో కలిసి చెక్‌లిస్ట్ ప్రకారం ఒకటికి రెండుసార్లు సరిచూసుకుని పోలింగ్ సామాగ్రిని తీసుకుని వెళ్లాలని సూచించారు. ఓటరు సీక్రెసి కాపాడేందుకు వీలుగా ఓటింగ్ కాంపాట్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని, సాయంత్రం నాలుగు గంటల వరకు లైన్‌లో ఉన్న ఓటర్లకు స్లిప్పులు ఇచ్చి ప్రతి ఒక్కరికి ఓటు వేసే అవకాశం కల్పించాలన్నారు. చివరి ఓటరు ఓటు వినియోగించుకున్న తర్వాత నిబంధనల ప్రకారం బ్యాలెట్ బాక్స్‌లను మూసివేసి సీల్ చేయాలని తెలిపారు. బ్యాలెట్ బాక్స్ సీలింగ్ పై హ్యాండ్ ఆన్ శిక్షణ నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగ పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తుకు బానిసలు కావద్దు

**-మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దేశ భవిష్యత్తు యువత పైనే ఉందని యువత మాదక ద్రవ్యాలు, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ వి. విజయరామ్ కుమార్, రఘునాథపాలెం సిఐ మహ్మద్ ఉస్మాన్ షరీఫ్ పిలుపునిచ్చారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ (ఎన్ఐఎస్‌డి) సౌజన్యంతో నెహ్రూ యువ కేంద్రం ఖమ్మం ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబిఏ) కార్యక్రమంలో భాగంగా గురువారం రఘునాథపాలెం బిసి వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ఉస్మాన్ షరీఫ్, నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ విజయరామ్ కుమార్ లు మాట్లాడుతూ దేశంలో డ్రగ్ దుర్వినియోగం ఒక పెరుగుతున్న సమస్యగా మారిందని ఇది వ్యక్తులకే కాకుండా కుటుంబాలు, సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుందన్నారు. యువత డ్రగ్స్ వాడడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటూ మానసిక స్థిరత్వం కోల్పోవడమే కాకుండా నేరాల పెరుగుదలకు కూడా కారణమవుతున్నారని తెలిపారు. యువత ఎక్కువగా గంజాయి మత్తులో పడి జీవితాలను పాడు చేసుకుంటున్నారని క్షణికానందం కోసం నిండు జీవితాన్ని బలి చేసుకోవద్దన్నారు. ఒక్కసారి అలవాటైతే అది వ్యసనంగా మారుతుందని మత్తుకు బానిసలు కావద్దని యువతకు




సూచించారు. పిపిటి ప్రజంటేషన్ ద్వారా మాదక ద్రవ్యాలు తీసుకుంటే యువత, విద్యార్థుల జీవితంలో ఎలాంటి అనర్థాలు జరుగుతాయో వివరించారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు సేవిస్తూ కనిపిస్తే డయల్ 100, హెల్ప్‌లైన్ నెం. 1908కు కాల్ చేయాలని కోరారు. గంజాయిని ఎవరైనా సరఫరా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మత్తు పదార్థాలు వాడమని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కమర్తపు భానుచందర్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా పక్కాగా అమలు చేయాలి

**ప్రజాపక్షం/చింతకాని :** ప్రతి రైతుకు రైతుభరోసా పక్కాగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్రరైతు సంఘం జిల్లా కోశాధికారి కూచిపుడి రవి డిమాండ్ చేశారు. బుధవారం చింతకాని మండలం వందనం గ్రామంలో రైతు సంఘం శాఖ సమావేశం ఆవుల మంగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కూచిపుడి రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మిర్చి ధరలు పతనమై రైతులు తీవ్ర ఆందోళనకు గురువుతున్నారన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు రైతు వద్ద ఉన్నపుడు ఒక ధర, రైతు చేయి దాటగానే వ్యవసాయ ఉత్పత్తులకు ఎలా రెక్కలు వస్తున్నాయని ప్రశ్నించారు. రైతాంగాన్ని విస్మరించిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదన్నారు.మిర్చి ధర క్వింటాకు రూ.25వేల మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. రైతురుణమాఫీ పూర్తి చేయాలని, రైతు భరోసా షరతులు లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం నూతన గ్రామ శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకు



న్నారు.నూతన శాఖ అధ్యక్షుడుగా ఆవుల హరీష్, ప్రధానకార్యదర్శిగా వుల పిచ్చయ్య పాటు మరో 8 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఐ శాఖ కార్యదర్శి ఆవుల మంగయ్య, సహాయ కార్యదర్శి సుంకు కృష్ణారెడ్డి, నాయకులు అమర్లపుడి వెంకన్న, పుల్లయ్య, ఎస్‌కె పాషా తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు జాతరను విజయవంతంచేయాలి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఈనెల 25 నుంచి ప్రారంభంకానున్న జాతరను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని, ఆర్డీఓ నరసింహారావు వారికి సూచించారు. గురువారం ఖమ్మంరూరల్ మండలంలోని తీర్థాల గ్రామంలో గల సంగమేశ్వరుని సన్నిధిలో అన్నిశాఖలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మునపటి సమీక్ష సమావేశంలో అధికారులు ఇచ్చిన మాట ప్రకారం చేపట్టిన పనుల పురోగతిని తెలుసుకున్నారు. చిన్న చిన్న సమస్యలు పెండిగ్‌లో ఉండటంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో ఆలయ పరిశర ప్రాంతాలలో చికెన్‌షాప్‌లు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆలయానికి సమీపంలోని ఊర్లోలోని బెల్ట్‌షాపులను కట్టడి చేయాలని ఎక్సైజ్ సిఐని ఆదేశించారు. ఎప్పటిలాగానే తమ దగ్గర డబ్బులు లేవు అధికారులే బాధ్యతగా చూసుకోవాలని ఈఓ పాడినపాటే పాడారు. కేవలం ఆలయం తరుపున వచ్చే ఆదాయం కోసం మాత్రమే దేవాదయశాఖ వారు చూస్తున్నారని, అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి జాతరకు సూమారు 40లక్షలపైనే ఆదాయం



వస్తుండగా మరల డబ్బులు లేవనే ప్రశ్నను లేవనెత్తడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం 25నుంచి మార్చ్ 1వరకు నిర్వహించనున్న జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాదయధర్మదయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి,డిపీఓ ఆశాలత, డిఎల్‌పీఓ రాంబాబు, తహశీల్దార్ రాంప్రసాద్, ఎస్‌హెచ్ఓ ముష్కరాజు, ఎంపిడీఓ కుమార్, ఎంపీఓ శ్రీదేవి, ఎంవీ,పాలెం పీహెచ్‌సీ వైద్యులు బాలకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కళ్లెం వెంకట్‌రెడ్డి, నాయకులు బోడ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలకు టోల్ ఫ్రీ నెంబర్ 1912 సంప్రదించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు వినియోగదారులు టోల్‌ఫ్రీ నెం.1912 ను సంప్రదించాలని విద్యుత్ శాఖ ఖమ్మం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎ. సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు 24 గంటలు అందుబాటులో ఉండి మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సేవలను అందించేందుకు టోల్‌ఫ్రీ నెం.1912ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, లో వోల్టేజీ, బ్రేక్‌డౌన్స్, ప్రమాదభరితంగా ఉన్న స్తంభాలు, వైర్లు తదితర వాటికి సంబంధించి, విద్యుత్ బిల్లుల్లో పేరు మార్పు, బిల్లుల్లో తేడాలు, విద్యుత్ మీటర్లలో సమస్యలు, ఆగిపోయిన మీటర్లు, నూతన సర్వీసుల మంజూరు, సర్వీస్ రద్దు వంటి విద్యుత్ సమస్యల కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 1912 ను సంప్రదించి సేవలు పొందాలని సూచించారు. ప్రతి ఒక్క వినియోగదారుడు గుర్తు పెట్టుకునేలా టోల్ ఫ్రీ నెం.1912ను విస్తృతంగా ప్రచారం చేపడుతున్నామని ఆయన తెలిపారు. కార్పోరేట్ కార్యాలయంలో 1912కు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారని నిరంతరం ఉన్నతాధికారుల పర్యవేక్షణ జరుగుతుందన్నారు. 1912కు వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

# శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిఆర్‌టియు అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. గురువారం పిఆర్‌టియు ఖమ్మం అర్బన్ మండల కమిటీ ఆధ్వర్యంలో విజయ్‌నగర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుడిపూడి శ్రీనివాసరావు, బి. రవికిరణ్ లు మాట్లాడుతూ ఈనెల 27న జరగనున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. శ్రీపాల్‌రెడ్డి గెలిస్తే ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు బాధ్యులు వేముల బిక్షం, జిటి రమేష్, పి.శ్రీనివాస్ రెడ్డి, పి.వెంకటేశ్వర రెడ్డి, శోభన్, కుసుమ నాగేశ్వరరావు, పరిశీలకులు పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ జయంతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఖమ్మం నగరంలోని ఖానాపురం యుపిహెచ్ కాలనీలో గల సేవాలాల్ మహారాజ్ ఆలయంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు బానోత్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బానోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో యువత ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బిక్కు నాయక్, తెలంగాణ గోర్ బంజారా ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు భూక్యా శోభన్ నాయక్, కొట్టే సుధాకర్, రాజ్ కుమార్, మణికంఠ, కార్పొరేటర్ జ్యోతిరెడ్డి, భారతి చంద్రయ్య, కోలేటి రాధాకృష్ణ, వినోద్‌బాబు, సురేష్, చంద్ర, అంజయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఊరచెరువును సాగర్ జలాలతో నింపాలి



**ప్రజాపక్షం/చింతకాని :** లచ్చగూడెం ఊరచెరువును సాగర్ జలాలతో నింపి ఎండుతున్న పంటలను కాపాడాలని లచ్చగూడెం అన్నదాతలు చింతకాని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు,ఆత్మకమిటీ డైరక్టర్ కొప్పుల గోవిందరావు ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్‌ను కలిశారు. ఈ సందర్భంగా కొప్పుల గోవిందరావు మాట్లాడుతూ ఊరచెరువులో నీరు లేకపోవడంతో చేతికొచ్చిన మొక్కజొన్న పంట ఎండిపోతుందని తక్షణమే సాగర్ జలాలతో చెరువులు నింపి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. స్పందించిన తహసీల్దార్ అనంత రాజు ఎన్నెస్పీ అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో సాగర్ జలాలతో చెరువులు నింపేందుకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కె జాన్‌రాజ్, చింతాల వెంకటేశ్వర్లు, శంకర్, మురళీ, ఉపేందర్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

# ఎంవి.పాలెం పీహెచ్‌సీని సందర్శించిన డిఎంఅండ్‌హెచ్‌ఓ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని ఎంవీ,పాలెం గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కళావతి భాయ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిశర ప్రాంతాలు, రికార్డులను తనఖీచేసి వైద్యులు బాలకృష్ణ, కనకదుర్గ నుంచి పేషంట్లకు అందిస్తున్న చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు..అసంక్రమిక వ్యాధులు స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా 30 సంవత్సరాల పైబడినటువంటి ప్రతి ఒక్క వ్యక్తి బీపీ, షుగర్ స్క్రీనింగ్‌చేయాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్ చంద్రకళ, ఎల్‌టి అజార్, ఎస్ఎన్ సంతోష్, ఫార్మసిస్ట్ వెంకటనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

# స్థలం ఇప్పించాలని వృద్ధురాలి నిరసన దీక్ష






**- ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశాం: తహశీల్దార్**

**ప్రజాపక్షం/ మధిర :** ఆక్రమణకు గురైన తన స్థలాన్ని ఇప్పించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఓ వృద్ధురాలు నిరసన దీక్ష చేపట్టింది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని దెందుకూరు గ్రామానికి చెందిన కనకపూడి కరుణమ్మ(85) అనే వృద్ధురాలు తన భూమిని ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించడం లేదందూ సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగింది. కనకపూడి కరుణమ్మకు దెందుకూరు గ్రామంలో ఇంటి స్థలం ఉంది. ఈ స్థలాన్ని కొంతమంది అన్యులు ఆక్రమించుకుని తనకు అన్యాయం చేశారని పేర్కొంటూ ఇటీవల తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసింది. అయినా అధికారులు పట్టించుకోవటం లేదంటూ సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో వృద్ధురాలు కరుణమ్మ నిరసన దీక్షకు దిగింది. ఈ క్రమంలో సిపిఎం నాయకులు సోషల్ మీడియా వేదికగా స్థానిక డిప్యూటీ సిఎం సతీమణి మల్లు నందిని చెప్పడం ద్వారానే బాధితురాలికి న్యాయం చేయడం లేదంటూ విమర్శలతో కూడిన పోస్టింగ్లు పెట్టారు. దీనిపై స్పందించి తహశీల్దార్ రాంబాబు నాయకులతో మాట్లాడుతూ ఫిర్యాదు మేరకు నిబంధనలకనుగుణంగా తమ పరిధిలో నోటీసులు జారీ చేయడం జరిగిందని, గడువు ముగియకపోవడంతో చర్యలు తీసుకోలేదని, ఇటువంటి తప్పుడు ప్రచారాలు, నిరసనలు, ధర్నాలు చేయడం సరైందని కాదని సిపిఎం నాయకులకు హితవు పలికారు. ఇటువంటి చర్యలు పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. వృద్ధురాలి స్థలం ఆక్రమించుకున్న వారికి నోటీసులు ఇచ్చామని, ఈ నెల 22తేదీ వరకు గడువు ఇవ్వడం జరిగిందని, అనంతరం ఇరుపక్షాల వద్ద ఉన్న ఆధారాల మేరకు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ పేర్కొన్నారు. డాక్యుమెంట్ ప్రకారం ఎవరు అర్హులైతే వారికి ఆస్థలం ఇస్తామని చెప్పారు. వృద్ధురాలి స్థలం విషయంలో రాద్ధాంతం చేయవద్దని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తహశీల్దార్ హామీ మేరకు వృద్ధురాలు దీక్షను విరమించుకుంది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలను మానుకోవాలి



**ప్రజాపక్షం/ మధిర :** వాస్తవాలు తెలుసుకోకుండా, ఆధారాలు లేకుండా కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ హెచ్చరించారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దెందుకూరు గ్రామానికి చెందిన కనకపూడి కరుణమ్మ స్థల వివాదాన్ని సిపిఎం పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు చేసి సమస్యను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. సిపిఎం నాయకులు వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరో చెప్పింది విని మల్లు నందినిపై అసత్య ప్రచారం చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ స్థల వివాదంలో కాంగ్రెస్ పార్టీకి కాని, మల్లు నందినికి కాని ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సోషల్‌మీడియాలో వాస్తవాలు తెలుసుకోకుండా పోస్టింగ్‌లు పెట్టవద్దని, అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యత వహించాల్సి వస్తుందని హితవుపలికారు. ఈ సమావేశంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షులు దారా బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, బాణావత్ వెంకటరమణ, నాయకులు కర్నాటి రామారావు, పత్తెపరపు సంగయ్య, బొమ్మకంటి హరిబాబు, షేక్.జహంగీర్, షేక్.బాజి, తలుపుల వెంకటేశ్వర్లు, మోదుగు బాబు తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు



**-ప్రైజ్ మనీ రూ. 2.50 లక్షలు**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మొట్టమొదటి సారిగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలను ఈనెల 22 నుంచి ఖమ్మం సర్దార్ పటేల్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఖమ్మంజిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చల్లపల్లి శ్రీనివాస్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి తెలిపారు. గురువారం సర్దార్ పటేల్ మైదానంలో ఖమ్మం టెన్నిస్ అరేనా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా క్రీడల అభివృద్ధి సంస్థ, ఖమ్మంజిల్లా టెన్నిస్ అసోసియేషన్ (కెడిటిఏ) ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి మార్చి ఒకటి వరకు చల్లపల్లి రాధమ్మ మెమోరియల్ జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ (మెన్స్) నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో జాతీయ స్థాయి క్రీడాకారులైన 145 మంది క్రీడాకారులు ఇప్పటి వరకు తమ ఎంట్రీలు నమోదు చేసుకున్నారని వారు తెలిపారు. ఆలిండియా ఏడవ ర్యాంకు క్రీడాకారుడు కూడా పాల్గొంటున్నారని వారు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతకు రూ. 2.50 లక్షలు ప్రైజ్ మనీ ఉంటుందన్నారు. ఈ పోటీలకు చీఫ్ రిఫరీగా ప్రవీణ్ నాయక్ వ్యవహరిస్తారని వారు తెలిపారు. క్రీడాకారులకు అన్ని రకాల వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. మొట్టమొదటిసారిగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు ఖమ్మం వేదిక కానుందని వారు తెలిపారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారని వారు తెలిపారు. ఈ టెన్నిస్ పోటీలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా॥ అనిల్ కాసినేని, కోశాధికారి కాంపాటి సత్యనారాయణ, మద్దినేని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ పంట నమోదు కార్యక్రమం ఏడిఏ సరిత

**ప్రజాపక్షం/కూసుమంచి :** కూసుమంచి మండలంలోని గురువారం జీళ్ళచెరువు గ్రామంలో డిజిటల్ పంట నమోదు కార్యక్రమాన్ని కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సరిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డిజిటల్ పంటను మొదటి కార్యక్రమాన్ని పొరపాట్లు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఏఈఓలకు సూచించారు. అనంతరం రైతులకు పామాయిల్ పంటపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రవీందర్ రైతులు పాల్గొన్నారు.



# "కోడ్" అమలు తీరుపై విమర్శలు







**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న శిలాఫలకాలపై రాజకీయ నాయకుల ప్రజాప్రతినిధుల పేర్లు కనపడటంతో ప్రజల నుంచి పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కల్లూరు లోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఉన్న శిలాఫలకాలకు పేర్లు కనబడుతున్న వాటికి ఎలాంటి చాటు ఏర్పాటు చేయకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. దీనిపై కల్లూరులో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నట్లు ఒకరినొకరు చర్చించుకుంటున్నారు. ఆ ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటారో లేదో అనుకుంటున్నారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు బాధ్యత అని ప్రభుత్వ కార్యాలయాలలో శిలాఫలకాలకు పేర్లు కనపడుతున్నట్లయితే సంబంధిత అధికారుల బాధ్యత అని వివరించారు. ఈ విషయమై ఉల్లంఘన జరిగితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో పేర్కొన్నారు.

# పేరువంచలో కల్తీ అవుతున్న మంచినీరు

**-పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారి**






**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పేరువంచలో పాఠశాల ఆవరణలో ఉన్న మంచినీటి ట్యాంకు వద్ద గేట్ వాల్ ఛాంబర్ లో మంచినీరు లీకై కల్తీ అవుతూ కంటికి కనిపిస్తున్నా కూడా నిర్లక్ష్యంతో పంచాయతీ సిబ్బంది అధికారులు అవే నీటిని ప్రజల ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా కల్తీ నీటిని సరఫరా చేయటంతో ప్రజలు అనేక విధాలుగా ఆరోపణలు విమర్శలు చేస్తున్నారు. ఎన్నిసార్లు చెప్పినా పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారి పట్టించుకోవడంలేదని గ్రామపంచాయతీ ప్రజలు తెలుపుతున్నారు. గేట్ వాల్ ఛాంబర్ పై మూత లేకపోవడం వల్ల కోతులు, కుక్కలు, జలకాలాడుతూ అవే నీటిని తాగుతూ కల్తీ నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారు. మరమ్మత్తులు చేసి మంచినీటిని అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ప్రైవేట్ వెంచర్‌కు నేషనల్ హైవే మట్టి..!

**- ఒక్కో డంపర్ లోడ్‌ను రూ.వెయ్యికి అమ్ముకున్న వైనం**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని మున్సిపాలిటీ పరిధిలో గల రెడ్డిపల్లి వద్ద ఖమ్మం,కొరవి రహదారి విస్తరణ పనులు గురువారం జరుగుతున్నాయి. ఇందులో ప్రొక్లైన్ ద్వారా రహదారి ఏర్పాటుకు ఎన్‌హెచ్‌హైవే సిబ్బంది మట్టిని తీశారు. దానిని అక్కడికి కూతవేటుదూరంలో ఉన్న ఓ వెంచర్‌లోకి మట్టిని స్వయంగా వారి డంపర్ల ద్వారా తరలించారు. అలాగే ఓ ప్రైవేట్ టిప్పర్‌ను ఏర్పాటు చేసుకుని మట్టిని తరలించారు. ఈ మట్టిని ఒక్కో ట్రిప్పుకు రూ.వెయ్యి చొప్పున నేషనల్‌హైవే సిబ్బంది అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అడ్డగోలు వ్యవహారంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రైతు సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తాం



-సరిహద్దు వివాదాల పరిష్కారానికి చర్యలు
-జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ తెలిపారు. గురువారం సింగరేణి మండలం తౌసిబుడు గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అటవీ సంబంధిత సమస్యలు, అటవీ హక్కుల గుర్తింపు, రహదారి కనెక్టివిటిపై నిర్వహించిన బహిరంగ గ్రామసభ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ పాల్గొన్నారు. అటవీ భూముల ఆక్రమణకు సంబంధించిన వివాదాలు, ఆందోళనలు, వ్యవసాయ క్షేత్రాలకు, మార్కెట్‌కు మెరుగైన రోడ్డు కనెక్టివిటి ఆవశ్యకత, ఆహారం, నీటి కోసం వ్యవసాయ భూముల వైపు వస్తున్న వన్య ప్రాణులకు సంబంధించిన సమస్యలు, కోతుల బెడదపై రైతులు సమస్యలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి మాట్లాడుతూ అడవుల్లో మంటలు చెలరేగడం, అటవీ ప్రాంతాల్లో పండ్ల చెట్లు తగ్గిపోవడంతో కోతులు వ్యవసాయ భూముల వైపు వస్తున్నాయని తెలిపారు. రైతుల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న సరిహద్దు వివాదాలను, రోడ్డు కనెక్టివిటిని మెరుగుపరిచేందుకు సంబంధిత శాఖల సమావేశంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కందకం తవ్వి అటవీ, ఆర్‌వోఎఫ్ఆర్ భూములకు స్పష్టంగా సరిహద్దులు ఏర్పాటు చేస్తామని, వన్య ప్రాణులను అడవికి పరిమితం చేసేందుకు పండ్ల చెట్లను, గచ్చకాయను నాటడం జరుగుతుందన్నారు. ట్రెంచ్ ఎస్ఎంసి కొలత కూడా పనిచేస్తుందన్నారు. ఉపాధి హామీ క్రింద పిటి, ఫార్మ్ ఫండ్ నిర్మాణానికి ప్రతిపాదించాలని అటవీ మంటలను ఆపడానికి సమాచార నెట్‌వర్క్ నిర్వహిస్తున్నామని దీనికి రైతులు సహకరించాలన్నారు. టిజిఎఫ్‌డిసి నిధుల క్రింద మొబైల్ హాస్పటల్ ప్రతిపాదిస్తున్నామని ఆయన తెలిపారు. అడవిలో మైదాన ప్రాంతంలో మంకి కోర్ట్ ప్లాంటేషన్ చేస్తామని, రైతులకు సౌరశక్తితో నడిచే బోర్‌వెల్‌ను అందించడానికి ఐటిడిఏ మద్దతు తీసుకుంటామన్నారు. ఈ సమావేశం ద్వారా ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకోవడానికి, అటవీ అధికారులపై స్థానిక సమాజం నమ్మకం పెంచుకోవడానికి వీలు కల్పించిందని ఆయన తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి రైతులు తమ సహకారం అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఎఫ్‌డివో మంజుల, అటవీ అధికారులు పాల్గొన్నారు.

# కూసుమంచి కస్తూర్బా గాంధీ విద్యాలయ ప్రిన్సిపాల్‌పై విమర్శలు

**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలోని మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ప్రిన్సిపాల్ అజితా కుమారి తన ఫోన్ నెంబర్ కు ఎన్నిసార్లు ఎంతమంది ఫోన్స్ చేసిన రింగ్ అవుతు (ఫోన్ యాక్టివేషన్ లో ఉండి పని చేస్తున్నప్పటికీ) పట్టించుకోవటం లేదని విమర్శ తీవ్రంగా వినిపిస్తోంది. వివరాల్లోకి వస్తే కూసుమంచి మండలం సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సుమారు 400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో ప్రాథమిక, ఉన్నత, జూనియర్ కళాశాల స్థాయి బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ విద్యాలయం గత కొన్ని సంవత్సరాల నుండి ఇంటర్మీడియట్ పరీక్షలకు కేంద్రంగా కూడా నిర్వహించుకోవడం జరుగుతుంది. ఇంత ప్రాధాన్యత ఉన్న ఈ విద్యాలయం కు విద్యా సంబంధమైన అవసరాల కోసం మాత్రమే విద్యాలయ పనివేళలలో మాత్రమే ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల లోపు ఎంతో మంది వివిధ ప్రాంతాల నుంచి (విద్యార్థినిల తల్లిదండ్రులు సైతం అనేకమార్లు) ప్రిన్సిపాల్ నుండి సమాచారం తెలుసుకొనుటకు గాని లేక సమాచారము ఇవ్వవలసి ఉన్నప్పటికీ (7993624554) ఫోన్ ద్వారా ప్రయత్నం చేస్తే ఎన్నడూ ఆమె ఫోను రిసీవ్ చేసుకున్న సందర్భాలు లేవని విమర్శ తీవ్రంగా వినిపిస్తుంది. ఈ తంతు అజిత కుమారి ఆమె బాధ్యతలు నిర్వహిస్తున్న కొన్ని సంవత్సరాల నుండి ఇప్పటివరకు కొనసాగుతుండటం గమనర్హం. ప్రభుత్వ విద్యాసంస్థల్లో పని చేస్తున్న స్వీపర్, టెండర్, వాచ్మెన్, డయల్వేజ్ వర్కర్, గెస్ట్ ఫ్యాకల్టీ, లేక కాంట్రాక్టు ఉద్యోగి సైతం ఒకసారి ఫోన్ కు మిస్డ్ కాల్ వస్తే మరోసారి వెంటనే అది ఎవరో ఎందుకు అనుకొని స్పందిస్తారు కానీ కూసుమంచి కస్తూర్బా గాంధీ ప్రిన్సిపాల్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న అజిత కుమార్ కి ఇటువంటి ఏమి వర్తించవు ఎవరైనా చేసుకోండి ఎన్నిసార్లు అయినా ఫోన్ చేసుకోండి నాకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తుంది. ఈ దుస్థితి ఏమిటని విద్యాలయంతో అవసరం ఉన్న వ్యక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయము తన సొంత జాగీరని భావిస్తున్న రా..? లేక బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్న రా..? లేక ఆమె విధులలో లేకుండా ఉన్నారా..? ఒకవేళ లీవ్ లో ఉన్న సెలవులో ఉన్నానని చెప్పటానికి కూడా ఇబ్బంది ఏమిటనే చర్చ కూడా తీవ్రంగానే జరుగుతుంది. ఇప్పటికైనా బాధ్యతాయుతమైన మండల విద్యాశాఖ అధికారులు లేనియెడల ఉన్నత స్థాయి విద్య అధికారులు విద్యాలయ అవసరాలకు కూసుమంచి కస్తూర్బా గాంధీ ప్రిన్సిపాల్ కు (7993624554) ఫోన్ చేసినప్పుడు స్పందించే విధంగా చూడాలని కోరుతున్నారు. ఒక వేళ తన ఫోన్ నెంబరు మార్చుకున్నట్లయితే కూడా సంబంధిత బాధ్యులకు విద్యాలయం కొరకు ఫోన్ చేసే వారికి సైతం మారిన ఫోన్ నెంబర్ నైనా తెలపాలని కోరుతున్నారు.

## ఉపాధి అవకాశం లేక
# అవస్థలు పడుతున్న వలస కూలీలు



**ప్రజాపక్షం/ఖమ్మం:** రామవరం పరిరక్షణ కమిటీ చేపట్టిన నేను సైతం కార్యక్రమంలో భాగంగా గరిమెళ్ళ పాడు గిరిజన బిడ్డలకు ఈద్గా కబ్రిస్తాన్ కమిటీ సహకారంతో ఏడు కుటుంబాలకు ఉపాధినివ్వడం జరిగినది. కబ్రిస్తాన్ ఈద్గా కబ్రిస్తాన్ అధ్యక్షులు ఫహీమ్ దాదా పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ముస్తఫా మాట్లాడుతూ, కుల మతాలకు అతీతంగా పనిచేయాల్సిన తరుణం ఏర్పడింది అన్నారు. గరిమెళ్ళపాడు ఉపాధి లేక వలస కూలీలుగా మారడం ఎంతో బాధాకరమైన విషయం పూర్వ వైభవానికి మనమందరం కలిసి గరిమెళ్ళ పాడు గిరిజన బిడ్డలను ఆదుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ సంబంధిత అధికారుల ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించి కృషి చేస్తామని వారు చెప్పారు. సుమారు 72 ఎకరాల స్థలం ఈరోజు నిర్వీర్యం అవ్వడం ఎంతోబాధాకరమైన విషయమని చెప్పారు. ఉభయ రాష్ట్రాలకు ఈ ప్రాంతం నుండి లక్షలలో మొక్కలు సరఫరా జరిగేది వంద కుటుంబాలకు ఉపాధి దొరికేది పరోక్షంగా మరికొంతమందికి ఉపాధి అవకాశాలు వచ్చేవి అన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని గరిమెళ్ళ పాడు కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ సభ్యులు వర్కింగ్ ప్రెసిడెంట్ షమ్మీ, సెక్రెటరీ రసూల్, ఉపాధ్యక్షులు ఖయ్యూమ్, జాయింట్ సెక్రెటరీ మహమ్మద్ గౌస్, మొయినుద్దీన్, వెంకటేశ్వర్లు, రాధా, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# కోయచలకలో పర్యటించిన ట్రైనీ కలెక్టర్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట రఘునాథపాలెం మండల పరిధిలోని కోయచలక గ్రామంలో పర్యటించారు. శిక్షణలో భాగంగా గురువారం ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట కోయచలక గ్రామంలో పర్యటించారు. వివిధ వర్గాల ఇండ్లకు వెళ్లి వారి జీవన స్థితిగతులు, పంటల సాగు, ఆర్థిక వనరులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉన్నత చదువులు చదివిన భువనేశ్వరి అనే యువతితో ట్రైనీ కలెక్టర్ కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం గ్రామానికి చెందిన చెరుకూరి రామారావు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను ట్రైనీ కలెక్టర్ పరిశీలించారు. ఏఏ పంటలు సాగు చేస్తున్నారు, దిగుబడులు, ఆదాయం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రాజ్యలక్ష్మి, ఆదాం, నాగరాజు, లింగరాజు, సీమా, నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌చెరుకూరిసీతారాములు, రైతులుపాల్గొన్నారు.

# ఫోక్సో కేసులో నిందితులకు జీవిత ఖైదు

-ఒక్కొక్కరికి రూ. 2.10 లక్షల జరిమానా

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇంటి బయట ఆడుకుంటున్న 12 ఏళ్ల బాలికను మాయ మాటలతో కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడిన నిందితులకు జీవత కాల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 2.10 లక్షల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా జడ్జి కె. ఉమాదేవి గురువారం తీర్పు వెల్లడించారని ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ సిఐ భానుప్రకాష్ తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2021 ఫిబ్రవరి ఏడున ఇంటి బయట ఆడుకుంటున్న బాలిక వద్దకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు మాయ మాటలతో బలవంతంగా మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లి నగర శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో లైంగిక దాడికి పాల్పడ్డారు. దీనికి సంబందించి బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్‌లో ఫోక్సో యాక్ట్ క్రింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన జడ్జి నేరం రుజువు కావడంతో నిందితులు ఖమ్మం రమణగుట్ట ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కాలేపల్లి సంపత్, ఖమ్మం మంచికంటి నగర్‌కు చెందిన పెయింటర్ పసువుల నవీన్ లకు జీవత కాల కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ. 2.10 లక్షలు జరిమానా విధించారని తెలిపారు. ఇట్టి కీలకమైన కేసులో నిందితులు నేరం నుంచి తప్పించుకోకుండా ప్రాసిక్యూషన్ తరుపున వాదించి నిందితులకు శిక్ష పడేలా చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ. శంకర్, ఇన్‌స్పెక్టర్ వెంకన్నబాబు (ప్రస్తుతం డిఎస్‌పి ఇంటిలిజెన్స్), ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. భవిష్యత్తులో కేసుల నుండి నిందితులు తప్పించుకోకుండా ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సిపి కోరారు.

# సమయాన్ని వృథా చేయరాదు

-మండల విద్యాశాఖ అధికారి జి వీరస్వామి



**ప్రజాపక్షం/ఖమ్మం:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు శేషుబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి జి వీరస్వామి మాట్లాడుతూ పరీక్షా సమయంలో సమయాన్ని వృధా చేయకుండా ఉత్తమ ఫలితాలను సాధించే విధంగా ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. అనంతరం కళాశాల ప్రధానాచార్యులు శేషుబాబు మాట్లాడుతూ విద్యార్థులకు వీడ్కోలు శుభాకాంక్షలు తెలుపుతూ నూతన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ పొందే విధంగా ప్రతి సంవత్సరం ఫలితాల కంటే ఈ సంవత్సరం ఫలితాలు ఇంకా ఎక్కువగా ఉండే విధంగా ఆశిస్తున్నామని, దానికి కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థుల కష్టం తోడ్పాటుతో మంచి ఫలితాలను ఆశిస్తున్నామని అన్నారు. అనంతరం అతిథులుగా వచ్చిన ఎంపీడీవో వరప్రసాద్, జెడ్‌పిఎస్ మల్లెలమడుగు ప్రధానోపాధ్యాయురాలు మేరీ, లెక్చరర్ల సంఘం జనరల్ సెక్రటరీ నాగేశ్వరరావు ప్రభుత్వ కళాశాల విద్య పట్ల అంకిత భావంతో కళాశాల అధ్యాపక బృందం, కళాశాలలో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలే రేపటి ఈ కఠాశాల పేరును జిల్లా వ్యాప్తంగా నిలబెట్టడానికి కష్టపడాలని వారందరికీ వీడ్కోలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.